కొండలు పిండి.. గుట్టలు గుల్ల..!
- రాంపూర్‌లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- కోహీర్ మండలంలో ఎర్రమట్టి తవ్వకాలు
- వాల్టా చట్టానికి తూట్లు.. పట్టించుకోని అధికారులు
- ఇష్టారాజ్యంగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు 7

మెదక్ బల్దియాలో 91 పోస్టులు ఖాళీ

- సిబ్బంది కొరతతో సతమతం
- 165 పోస్టులు మంజూరు.. ఉన్నది 74 మంది ఉద్యోగులే..
- ఏఈ, సర్వేయర్ స్థానాలు ఖాళీ
- 6 సీనియర్ అసిస్టెంట్, 28 వార్డు ఆఫీసర్లు, 2 బిల్ కలెక్టర్ పోస్టులదీ ఇదే పరిస్థితి
- గాడి తప్పుతున్న పాలన

మెదక్, సెప్టెంబరు 23: జిల్లాకేంద్రమైన మెదక్ మున్సిపాలిటీలో సిబ్బంది కొరతతో పాలన గాడి తప్పుతోంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకురావడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపినా నియామకాల్లో జాప్యం జరుగుతోంది. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో 165 పోస్టులు మంజూరు ఉండగా.. కేవలం 74 మంది ఉద్యోగులతో నెట్టుకువస్తున్నారు. మిగిలిన 91 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో, ఉన్నవారిపై పనిభారం ఎక్కువై ప్రజలకు సరైన సేవలు అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, రెవెన్యూ, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో సేవలకు ఆటంకం ఏర్పడుతున్నది.

ఇంజనీరింగ్ విభాగంలో..

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించిన ఏఈ కిష్టయ్య 3 నెలల క్రితమే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు మరొకరు విధుల్లో చేరలేదు. నిజామాబాద్ నుంచి ఒక ఏఈ బదిలీపై మెదక్‌కు వస్తున్నారని ప్రచారం జరిగినా ఆయన చేరలేదు. మరో ఏఈ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉండడంతో తాత్కాలిక ఇంజనీర్‌తో పనులు కానిస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు రెండూ ఖాళీలే. రెండు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, 2 క్యాడ్ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయలేదు. హెల్త్ అసిస్టెంట్ పోస్టులు రెండు ఉండగా.. ప్రస్తుతం ఒకరే విధుల్లో కొనసాగుతున్నారు.

టౌన్‌ప్లానింగ్‌లోనూ..

మున్సిపాలిటీలో కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగంలోనూ ఖాళీల కొరత వేధిస్తోంది. వేగంగా విస్తరిస్తున్న జిల్లా కేంద్రంలో నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. వీటికి అనుమతులు ఇవ్వడం, పనులను పర్యవేక్షించాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగంలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉంది. టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ అధికారుల పోస్టులు 4 సైతం ఖాళీగా ఉన్నాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బందితో పనులు చేయించుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలు అరికట్టడంలో కీలకమైన ఈ శాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.


మెదక్‌లోని మున్సిపల్ కార్యాలయం

అదే దారిలో రెవెన్యూ విభాగం

మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరులయిన ఆస్తి పన్ను, నల్లా బిల్లు, ట్రేడ్‌లైసెన్స్ రుసుము.. తదితర ఫీజులను వసూలు చేయాల్సిన రెవెన్యూ విభాగంలోనూ సరిపడా సిబ్బంది లేరు. ఈ విభాగంలో మూడు బిల్ కలెక్టర్ పోస్టులు మంజూరు ఉండగా ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. రెండు పోస్టులు భర్తీ చేయనే లేదు. అకౌంట్స్ సెక్షన్‌లో రెండు సీనియర్ అకౌంటెంట్ పోస్టులు మంజురు ఉండగా ఒక్కరే కొనసాగుతున్నారు. మరో ఇద్దరు జూనియర్ అకౌంటెంట్ పోస్టులనూ భర్తీ చేయకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించారు. ఇవేకాకుండా సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 6, వార్డు ఆఫీసర్ పోస్టులు 28 మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు భర్తీ చేయకపోవడంతో సాధారణ పరిపాలనలోనూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ పోస్టులను భర్తీ చేస్తేనే జిల్లాకేంద్రంలో పాలన గాడినపడుతుందని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య విభాగంలోనే అత్యధికంగా..

మున్సిపల్ శానిటరీ విభాగంలోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ విభాగంలో హెల్త్‌అసిస్టెంట్ పోస్టులు రెండు మంజూరు కాగా.. ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. పబ్లిక్‌హెల్త్‌వర్కర్ పోస్టులు 37 భర్తీ చేయాల్సి ఉండగా.. 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు స్కావెంజర్స్ పనిచేయాల్సి ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. డ్రైవర్ 1, వాచ్‌మెన్ 2, మాలీ 1, ఎలక్ట్రీషియన్ 3, ఒక ఫిట్టర్ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో చెత్త తరలించే వాహనాలు, ట్రాక్టర్లు, ఫాగింగ్ మిషన్ల నిర్వహణ అధ్వానంగా తయారైంది. తరచూ మరమ్మతులు తలెత్తున్నాయి. ఈ విషయంలో తరచూ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే సునీతారెడ్డి ఇంటిపై దాడి : హరీశ్‌రావు

నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబరు 23: ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మండలంలోని శివ్వంపేటలో ఆదివారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఎమ్మెల్యే ఇంటి ఎదుట టపాసులు కాల్చే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో సోమవారం హరీశ్‌రావు.. సునీతారెడ్డిని పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంట్లో లేని సమయంలో కావాలని గొడవ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ తన ఇంటి వద్ద రచ్చ చేయాలనే ఉద్దేశంతోనే ప్రణాళిక ప్రకారం దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. హరీశ్‌రావు వెంట ఎర్రోళ్లశ్రీనివాస్, హరికృష్ణ, పబ్బ మహేష్ గుప్తా, మన్సూర్, చంద్రాగౌడ్, రమణాగౌడ్, హన్మంతరెడ్డి, భిక్షపతిరెడ్డి తదితరులు ఉన్నారు.


సునీతారెడ్డి ఇంటి వద్ద జరిగిన ఘటన వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కేసు విచారిస్తున్నాం: ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటి వద్ద గొడవ విషయమై తమకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దోషులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, సమన్వయం పాటించాలని కోరారు.



సింగూరుకు జల పరవళ్లు

మళ్లీ పోటెత్తిన వరద.. నిండుకుండలా జలాశయం

పుల్‌కల్, సెప్టెంబరు 23 : సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తింది. రెండు రోజులుగా ప్రాజెక్టుకు ఎగువన గల మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్నదని నీటి పారుదల శాఖ డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెలారంభంలో ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకోవడంతో ఐదో తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. అయితే, వరుసగా ఐదు రోజుల పాటు గేట్లు ఎత్తి ఉంచిన నీటి పారుదల శాఖ అధికారులు వరద తగ్గుముఖం పట్టడంతో క్రమేణా ఒక్కొక్కటిగా గేట్లను మూసివేస్తూ వచ్చారు. చివరగా తెరిచి ఉంచిన ఒక్క గేటును సైతం మూసివేసి, కేవలం జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా వరద నీటిని ప్రవాహన్ని దిగువకు వదులుతున్నారు. తాజాగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం పెరిగింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11,656 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 11వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరున్నర ఎత్తి 8,142 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,823 క్యూసెక్కుల వరద దిగువకు విడుదలవుతోంది. సోమవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లు కాగా, ప్రస్తుతం 523.565 మీటర్లకు చేరుకున్నది.

క్రస్ట్ గేట్, స్కవర్ గేట్ ఎత్తివేత

మంజీర రిజర్వాయర్‌కు కూడా ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో 8వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరు ఎత్తు, స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తు ఎత్తి వరద నీటిని విడుదల చేస్తున్నారు. దిగవన ఘనపురం (వనదుర్గ ప్రాజెక్టు)కు మంజీర పరుగులెడుతున్నది. మంజీర నదికి మళ్లీ వరద పోటెత్తడంతో రైతులు, కూలీలు మంజీర నది తీర ప్రాంతానికి వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

5.86 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సింగూరు ప్రాజెక్టు నీటి ద్వారా 5.86 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని మినీ హైడల్ స్టేషన్స్ జెన్‌కో పోచంపాడ చీఫ్ ఇంజనీర్ వీ.రమేశ్‌బాబు తెలిపారు. సింగూరు ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో రెండు టర్బైయిన్లు చురుకుగా పనిచేస్తున్నాయని, రోజుకు 0.36 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్ సదాశివపేట, జోగిపేట ప్రాంతాల్లోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు సరఫరా చేస్తున్నామన్నారు.

సింగూరులో నీటి నిల్వ వివరాలు

ప్రాజెక్టు సామర్థ్యం	29.917 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	29.708 టీఎంసీలు
ఇన్‌ఫ్లో నమోదు	11,656 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	10,965 క్యూసెక్కులు
జల విద్యుదుత్పత్తి (రోజుకు)	0.36 మిలియన్ యూనిట్లు


దుకాణం వద్ద బారులు తీరిన మహిళలు

భలే మంచి చౌక బేరం..

రూ.50కే చీర.. ఎగబడ్డ మహిళలు

నర్సాపూర్, సెప్టెంబరు 23: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో సోమవారం ఓ షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా నిర్వాహకులు రూ. 50కే చీర అంటూ ప్రచారం చేయడంతో మహిళలు పెద్ద సంఖ్యలు ఎగబడ్డారు. ముందుగా వచ్చిన వంద మందికే రూ. 50కే చీర అంటూ ప్రచారం చేయడంతో ఎవరికి వారు ముందుగా మాల్‌లోకి వెళ్లేందుకు పోటీ పడటంతో వారిని నియంత్రించేందుకు నిర్వాహకులు పడరాని పాట్లు పడ్డారు. మొత్తానికి వంద మంది లోపలికి వెళ్లగా.. మిగిలిన వారు నిరాశతో వెనుదిరిగారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

అర్జీలు స్వీకరించిన మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు
సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశం

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : ప్రజావాణిలో వచ్చిన వినతులను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. మెదక్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు తరలివచ్చారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మెదక్‌లో 148 దరఖాస్తులు

మెదక్‌లో నిర్వహించిన ప్రజావాణికి 148 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా ధరణికి సంబంధించి 50, రుణమాఫీ 9, డబుల్‌బెడ్‌రూం 5, ఇతర సమస్యలపై 84 అర్జీలు అందినట్టు అధికారులు పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఏవో గోవింద్, డీపీవో యాదయ్య, డీఎంహెచ్‌వో డా. శ్రీరామ్, డీఈవో రాధాకిషన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే, మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ మహేందర్ దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను తెలుసుకుని, న్యాయం చేయాలని ఆయా పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులనె ఫోన్‌లో ఆదేశించారు.

బాధితులకు న్యాయం చేయండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : సంగారెడ్డిలో ప్రజావాణి అర్జీలను కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వీకరించారు. మునిపల్లి మండలం పెద్దచెల్మెడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు నర్సింహులు తన కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నానని, మూడుచక్రాల రిక్షా ఇప్పించాలని కోరాడు. జిన్నారం మండలం అండూర్ గ్రామానికి ఆశమ్మ.. తన భర్త కిష్టారెడ్డి మృతి చెందినందున ఆయన పేరున ఉన్న భూమిని తన పేరి పౌతి చేయాలని రెండు సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో బెల్ట్‌షాపులు తొలగించాలని గ్రామస్థులు అర్జీ అందజేశారు. పింఛన్‌లు మంజూరు చేయాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి చూపాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వివిధ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. వాటన్నింటినీ పరిశీలించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయానికి రాకుండా చూడాలని సూచించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే అందుకు కారణాలను అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌వో పద్మజరాణి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


సంగారెడ్డిలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి


సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ ప్రాంతాల్లోని కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మహేందర్ ప్రజావాణిలో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతికి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల నుంచి విషతుల్య పదార్థాలను భూమిలోకి వదులుతున్నారన్నారని ఆరోపించారు. పీసీబీ, కార్మిక విభాగం అధికారులు పట్టించుకోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్టు చెప్పారు.

వారు వద్దన్నా.. వీరు అనుమతిచ్చేశారు!

కార్యదర్శి బదిలీ అయిన 20 రోజుల్లోనే..
రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి ఎసరు

కొండాపూర్, సెప్టెంబరు 23 : ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమార్కులకు వరంగా మారింది. పంచాయతీ అధికారి అనుమతి నిరాకరించినా.. రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇవ్వడంతో రూ. కోట్లు విలువైన భూమి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం నెలకొన్నది. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గుంతపల్లి పంచాయతీ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.69లో మొత్తం 97.11 ఎకరాల భూమి ఉంది. ఇందులో ప్రభుత్వ అసైన్డ్ భూమి 76.26 ఎకరాలు ఉండగా.. పట్టా భూమి 20.35 ఎకరాలు ఉన్నది. అసైన్డ్‌భూమిలో కొంత ఎవరికీ కేటాయించని మిగులు భూమి కూడా ఉంది. ఈ సర్వేనంబర్‌లో 20 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేయడం కోసం ఓ ప్రైవేటు సంస్థ పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నది. అయితే వెంచర్ కోసం అనుమతి కోరిన సర్వే నంబర్‌లో ప్రభుత్వ మిగులు భూమి కలిసి ఉందని ఆరోపణలు రావడం.. దారి సమస్యలు ఉండడంతో పంచాయతీ పాలకవర్గం అనుమతి నిరాకరించింది. సదరు సంస్థ వెంచర్‌కు అనుమతి కోసం ఆన్‌లైన్‌లో 8 సార్లు దరఖాస్తు చేసినా నిరాకరించారు. సరైన డాక్యుమెంట్లు, రెవెన్యూ ఎన్‌వోసీ సర్టిఫికెట్లను చూపాలని పాలకవర్గం కోరింది. ఈ పత్రాలు ఇవ్వకపోవడంతో పంచాయతీ కార్యదర్శి సదరు అప్లికేషన్‌పై ఆన్‌లైన్‌లో రిమార్క్ అని పేర్కొని పక్కనపెట్టారు. సదరు కార్యదర్శి జూలై 20న బదిలీ అయ్యారు. ఇదే అదనుగా దరఖాస్తును డీటీసీపీకి పంపించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై గ్రామస్థులు జిల్లా పంచాయతీ అధికారి, డీటీసీపీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు ఎంపీవో మాత్రం నిబంధనల ప్రకారం రెవెన్యూశాఖ ఎన్‌వోసీ ఉంటే దరఖాస్తు చేసుకున్న వారంలో వెంచర్ ప్రతిపాదనను డీటీపీసీకి పంపించాల్సి ఉంటుందని సమాధానం ఇచ్చారు. కానీ, గత కార్యదర్శి లేవనెత్తిన అభ్యంతరాలపై ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. కాగా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా.. ప్రజల అభ్యంతరాలను తెలుసుకోకుండానే రెవెన్యూశాఖ ఎన్‌వోసీ ఇవ్వడంతోనే వెంచర్‌కు మార్గం సుగమం అయ్యిందని, పంచాయతీ వద్దన్నా ప్రతిపాదనలను డీటీపీసీకి మతలబు ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.


గుంతపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 69లోని భూమి



జీపీ లాగిన్‌లో రిమార్క్, గ్రామస్థులు అందజేసిన వినతిపత్రం

రీజనల్ రింగ్ రోడ్డుకు 436.20 ఎకరాల భూసేకరణ

- ప్రభుత్వ నిర్ణయం మేరకే పరిహారం చెల్లింపు
- ప్రక్రియ కొలిక్కివచ్చేందుకు మరో రెండు, మూడు నెలలు పట్టే అవకాశం
- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, సెప్టెంబరు 23 : హైదరాబాద్ నగరం చుట్టూరా నిర్మించతలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డుకు తూప్రాన్ డివిజన్ పరిధిలో 436.20 ఎకరాలు భూసేకరణ చేయనున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరభాగంగా సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 158 కిలోమీటర్ల పొడవు రీజనల్ రింగ్ రోడ్డును ఎన్‌హెచ్‌ఏఐ చేపడుతున్నట్లు వివరించారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం 2022 సెప్టెంబరు 2న కేంద్ర ప్రభుత్వం 3ఏ నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. తూప్రాన్ డివిజన్ పరిధి తూప్రాన్ మండలం వట్టూరులో 32.37 ఎకరాలు, నాగులపల్లిలో 116 ఎకరాలు, ఇస్లాంపూర్‌లో 100 ఎకరాలు, దాతర్‌పల్లిలో 1.30 ఎకరాలు, గుండ్రెడ్డిపల్లిలో 57.30 ఎకరాలు, కిష్టాపూర్‌లో 0.13 ఎకరాలు, వెంకటాయపల్లిలో 42.30 ఎకరాలు, నర్సంపల్లిలో 73.28 ఎకరాల భూసేకరణ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఇందులో 2023 ఆగస్టు 8న 329.54 ఎకరాలకు కేంద్ర ప్రభుత్వం తరపున ఎన్‌హెచ్‌ఏఐ గజిట్ నోటిఫికేషన్ చేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మధ్య సంప్రదింపులు జరిగి మార్కెట్ విలువ నిర్ధారణ చేయగానే భూనిర్వాసితులకు చెల్లింపులు చేయడం ప్రారంభమవుతుందని వివరించారు. అలాగే, అదనపు 3డీ జరిగిన 93.95 ఎకరాలకు అదే ధర ప్రకారం చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. మిగిలిన 16.588 ఎకరాల్లో 9.38 ఎకరాలకు అదనపు 3ఏ ప్రకటన కోసం ఎన్‌హెచ్‌ఏఐ పీడీ ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. మిగిలిన 7.163 ఎకరాలు ఏజెన్సీ సర్వే చేసిన తరువాతే భూసేకరణ చేయనున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు. చెల్లింపులు చేసేందుకు రెండు, మూడు నెలల ప్రక్రి పట్టవచ్చని ఆర్డీవో వివరించారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 23: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పోలీసులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సోమవారం ఆయన పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 28న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజీ పడటానికి అవకాశం ఉన్న.. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న డబ్బు త్వరగా అందేలా చూడాలని, 25వేల కంటే తక్కువ డబబ్బు కోల్పోయిన కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదు చేసుకొని, ఎఫ్ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియ చేసుకోవచ్చని అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ, పోలీసు అధికారులు

సిర్గాపూర్‌లో యువకుడు అదృశ్యం


శేఖర్ (ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 23: యువకుడు అదృశ్యమైన సంఘటన సిర్గాపూర్‌లో మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం సిర్గాపూర్కు చెందిన శేఖర్‌కు మద్యం అలవాటు ఉన్నంది. గత 15 రోజులుగా మద్యం మానివేయడంతో పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికెళ్లిన అతను తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కలవారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి వెళ్లేటపుడు శేఖర్ నీలి రంగు షర్టు, నల్ల ప్యాంటు ధరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శేఖర్ సోదరుడు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికుల నిరసన

నారాయణఖేడ్, సెప్టెంబరు 23: కార్మికులకు వ్యతిరేకంగాఉన్ననాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం ఖేడ్ స్వామివివేకానంద విగ్రహ వద్ద కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శస్తూ నిరసన తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కనీస వేతనాలు, పని గంటలు, బోనస్, ప్రమాదాలకు నష్టపరిహారం తదితర 44 చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా పార్లమెంట్‌లో ఆమోదించిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసు, రాజు, సాయమ్మ, లక్ష్మి, శకుంతల, సిద్దమ్మ పాల్గొన్నారు.


ఖేడ్‌లో నిరసన తెలుపుతున్నకార్మికులు

సర్వీసు రోడ్డు.. సంగతేంటి?

- ఓఆర్ఆర్ పూర్తి అయి 15 ఏళ్లు..
- ఇంకా అందుబాటులోకి రాని సర్వీసు రోడ్డు
- అడ్డంకిగా రైల్వే ఓవర్ బ్రిడ్జి
- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- ఇంకా నత్త నడకే.. అవి పూర్తయితేనే రోడ్డు..


అసంపూర్తిగా ఉన్న రైల్వే బ్రిడ్జి

రామచంద్రాపురం, సెప్టెంబరు 13: అది పదిహేనేళ్ల నాటి నుంచి నానుతున్న సమస్య. రైల్వే బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయని భావించినా.. పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ తన సామగ్రి తరలించేందుకు వేసుకున్న తాత్కాలిక ర్యాంపుపై ప్రమాదకరంగా ప్రయణిస్తున్నారు. సుమారు 18 ఏళ్ల క్రితం ఓఆర్ఆర్ పనులు ప్రారంభం కాగా, దాని వెంట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు సర్వీసు రోడ్డునూ వేసిన విషయం తెలిసిందే. అయితే, రామచంద్రాపురం పరిధి ఈదులనాగుపల్లి-వెలిమెల గ్రామాల శివారులో రైల్వే లైన్ ఉండటంతో అక్కడ సర్వీసు రోడ్డు పనులు ముందుకు సాగలేదు. రైల్వే లైన్‌పై బ్రిడ్జి నిర్మించిన తర్వాత సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్డు పనులు ఆపేసి ట్రాక్ దాటిన తర్వాత ముత్తంగివైపు సర్వీసు రోడ్డును కొనసాగించారు. అదే సయంలో ఓఆర్ఆర్ కాంట్రాక్ట్ పనులు చేపట్టిన సంస్థ తమ సామగ్రిని తరలించేందుకు ఈ గ్రామాల మధ్య సర్వీస్ రోడ్డు వదిలేసిన ప్రాంతంలో ఓ ర్యాంపు (మట్టి రోడ్డు) వేసింది.

అదే దారి..

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ర్యాంపు ఇప్పుడు వెలిమెల గ్రామస్థులకు రహదారిగా మారింది. అయితే, ఓఆర్ఆర్ పనులు పూర్తయిన తర్వాత కాంట్రాక్ట్ సంస్థ ఆ ర్యాంపును తొలగించేందుకు సిద్ధపడగా.. తమ గ్రామస్థులకు ఇబ్బందులు తప్పవని స్థానికంగా ఆందోళన వ్యక్తమైంది. రైల్వే బ్రిడ్జి పనులు పూర్తై, సర్వీసు రోడ్డు పనులు కూడా పూర్తయిన తర్వాత ర్యాంపు తలగించాలని అప్పటి సర్పంచ్ రాజ్యం మహిపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ర్యాంపు తొలగించకుండా అడ్డుకున్నారు. హెచ్ఎండీఏ ఈ ర్యాంపును తొలగించేందుకు సిద్ధపడగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ర్యాంపుపై తన సొంత నిధులతో సీసీ వేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆయన పనులకు శ్రీకారం చుడుతూ కొబ్బరికాయ కూడా కొట్టారు. అయితే, అనుమతి లేకుండా పనులు చేయడాన్ని హెచ్ఎండీఏ ఆక్షేపించడంతో పనులు ఆగిపోయాయి. అయితే, సమస్య తీవ్రతను గుర్తించిన ఎంపీ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా, రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం అయ్యాయి. అయితే, ఆ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. పనులు జాప్యం జరుగుతుండటంతో ఇప్పటికీ ప్రజలు సదరు ర్యాంపుపైనా ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు.


ప్రమాదకరంగా మారిన ర్యాంపు రోడ్డుపై వాహనాల రాకపోకలు

పనులు పూర్తి చేయాలి : రాజ్యం మహిపాల్ గౌడ్, మాజీ సర్పంచ్



ఓఆర్ఆర్ ఏర్పాటై 15 ఏళ్లు కావుస్తున్నా.. వెలిమెల వద్ద సర్వీసు రోడ్డు అందుబాటులోకి రాలేదు. దీంతో వెలిమెల, వెలిమెల తండ, సందుగూడెం, కొండకల్, పాటి, కర్ధనూరు, ఘనపూర్ గ్రామాల ప్రజలు ఓఆర్ఆర్ పైకి వెళ్లేందుకు, దిగేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, సర్వీసు రోడ్డు పనులు చేపట్టాలి. ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

వెలివేతకు గురైన కుటుంబానికి భరోసా

- హైకోర్టు ఆదేశాలతో కదిలిన అధికారులు
- గ్రామస్థులకు కలెక్టర్, ఎస్పీ అవగాహన సదస్సు
- కలిసి ఉండాలని హితవు


గౌతోజీగూడెం గ్రామంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మనోహరాబాద్, సెప్టెంబరు 23 : గ్రామస్థులు సామాజిక బహిష్కణ చేసిన కుటుంబానికి అధికారులు అండగా నిలిచారు. మండలంలోని గౌతోజీగూడ గ్రామానికి చెందిన పంచమి నర్సమ్మ, ఆమె కుమారులు అర్జున్, చంద్రంలు తమను సామాజిక బహిష్కరణకు గురి చేశారంటూ ఈ నెల 11న జిల్లా ఎస్పీకి ఎక్స్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని పంచమి చంద్రం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతోపాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్యాలయంలో, మానవ హక్కుల కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో హైకోర్టు వెలివేతకు గురైన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఈ నెల 20న కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్, ఆర్డీవో జయచంద్రారెడ్డి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పూనుకుంటే సహించేది లేదన్నారు. వెలివేత తప్పని, ఇలాంటి చర్యలు మళ్లీ జరగవద్దని హెచ్చరించారు. అంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్థులంతా ఒక్క కుటుంబంగా ఉండాలని సూచించారు. కొందరిపై కక్షసాధింపు ధోరణి తగదన్నారు. ఇద్దరు అధికారులు గ్రామస్థులతో మాట్లాడి సామరస్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశికళ, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీటీ కౌశిక, ఎస్ సుభాష్‌గౌడ్, మండల ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.3.50 లక్షలకు కంది తైబజార్ వేలం


తైబజార్ వేలం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీ శ్రీనివాస్


కంది, సెప్టెంబరు 23 : మండలకేంద్రమైన కందిలోని తైబజార్‌కు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ వేలంపాట నిర్వహించారు. వచ్చే సంవత్సరం మార్చి 31వ తేదీవరకు 6 నెలల వ్యవధికి మాత్రమే తైబజార్ వేలం వేశారు. గ్రామానికి చెందిన పది మంది ఈ వేలంలో పాల్గొనగా.. చాంద్‌పాష అనే వ్యక్తి రూ.మూడున్నర లక్షలకు కైవసం చేసుకున్నారు. వేలంలో వచ్చిన ఈ డబ్బును గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి విద్యాధర్, బిల్ కలెక్టర్లు మల్లేశం, వీర్రాజు, సతీష్, కిరణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ కోసం స్థల పరిశీలన


మోడల్ డిగ్రీకళాశాల ఎదుట స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 23: ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాల ఎదుట ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు బస్ షెల్టర్ నిర్మించనున్నారు. అందుకోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, పీఆర్వో పాండు, దాత తానాజీ తదితరులు పర్యటించారు. పట్టణం నుంచి డిగ్రీ కళాశాల నాలుగు కిలో మీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు కోరిన మేరకు ఎమ్మెల్యే రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయించారు. బస్ షెల్టర్ ఏర్పాటుకు సైతం ఆయన హామినివ్వగా పట్టణానికి చెందిన వ్యాపార వేత్త తానాజీ దాతగా ఖర్చును సమకూర్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు కళాశాల ఎదుట స్థలాన్ని ఖరారు చేయగా త్వరలోనే నిర్మిస్తామని దాత తెలిపారు.


20 లీటర్ల గోవా మద్యం పట్టివేత


గోవామద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

జహీరాబాద్, సెప్టెంబరు 23 : మహారాష్ట్రలోని గోవా నుంచి హైదరాబాద్‌కు ట్రావెల్స్ బస్సుల్లో అక్రమంగా తీసుకువస్తున్న 20 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్‌ఎన్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిరాగ్‌పల్లివద్ద గల ఎక్సైజ్ చెక్‌పోస్టువద్ద సోమవారం ఉదయం తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని గోవా నుంచి తెలంగాణకు వస్తున్న టూరిస్టు బస్సులను తనఖీలు చేయగా అందులో 20లీటర్ల నిషేధిత అక్రమమద్యం లభించింది. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనఖీల్లో సీఐలు చంద్రశేఖర్, మల్లిఖార్జున్, ఎస్ఐలు హన్మంతు, రమేష్, ఇబ్రహీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి

- తహసీలార్‌కు పూర్వ వీఆర్‌ఏల వినతి


వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్ఏలు

శివ్వంపేట, సెప్టెంబరు 23: గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో నెం.81, 85, 98 వలన ప్రమోషన్ పొందిన 55 నుంచి 61 వయస్సు వీఆర్ఏలు రోడ్డున పడ్డాయని సదరు వ్యక్తులు ఆవేదనం వ్యక్తం చేశారు. తక్కువ సర్వీస్ చేసి, ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండానే పదవీ విరమణ పొందుతూ ఉన్న ఇక్క ఆర్థిక వనరు కోల్పోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 600 మంది రిటైర్మెంట్ అయ్యారని, ఇంకా ఇతర సమస్యలతో కూడా బాధపడుతున్నామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంతోకాలంగా గ్రామాల్లో చేస్తున్న వెట్టి చాకిరిని గుర్తించి తమ వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా చేసి న్యాయం చేయాలని కోరారు.


రాంపూరు పరిధిలో కొండల నుంచి తీసిన రాతి కడీలు


ట్రాక్టర్లలో తరలిస్తున్న రాతి కడీలు


ప్రభుత్వ భూమిలో బండలను పగులగొడుతున్న కూలీలు

కొండలు పిండి.. గుట్టలు గుల్ల..

ఇష్టారాజ్యంగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు

- రాంపూర్‌లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- కోహీర్ మండలంలో ఎర్రమట్టి తవ్వకాలు
- కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు
- వాల్టా చట్టానికి తూట్లు.. పట్టించుకోని అధికారులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 22 : ప్రకృతి సంపదను పరిరక్షించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాల్టా చట్టాన్ని కొందరు చుట్టంగా చేసుకుని అక్రమార్కులకు పాల్పడుతున్నారు మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు మైనింగ్ వ్యాపారులు రాజకీయ పలుకుబడితో యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలోని రాతి కొండలను కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అంతరించిపోతున్న కొండలు..

రాంపూర్ గ్రామ శివారులో పుష్కలంగా ఉన్న రాతి కొండలు మైనింగ్ వ్యాపారులకు ఓ వరంగా మారాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ రాతి కొండలను ధ్వంసం చేసి పునాది రాళ్లు, కడీలుగా మార్చుతూ విక్రయిస్తున్నారు. గజ్వేల్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన కొందరు కూలీలను రప్పించి అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేనిచోట్ల జనరేటర్లు, అధునాతన పరికరాలను వినియోగిస్తూ కొండలను పిండిచేస్తున్నారు. దీంతో గుట్టలు, కొండలు రోజురోజుకూ అంతరించిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలు మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఇటు వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తుందని ప్రజలు వాపోతున్నారు.

దర్గాగా పట్టణ ప్రాంతాలకు రవాణా..

అక్రమంగా కొనసాగిస్తున్న రాతీ కడీలను ట్రాక్టర్లలో దర్గాగా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అల్లాదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయం కూత వేటు దూరంలోని 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు మీదుగా సంగారెడ్డి, జహీరాబాద్ తదితర పట్టణ ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుని ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


చింతలఘట్టు గ్రామ పరిధిలో మట్టి తవ్వకాలతో కనుమరుగైన గుట్ట

దర్గాగా ఎర్రమట్టి తవ్వకం..

కోహీర్, సెప్టెంబరు 22 : మండలంలోని పెద్ద పెద్ద గుట్టలు, కొండలు అక్రమార్కుల చేతివాటంతో కనుమరుగవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎర్రమట్టిని తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని చింతలఘట్టు, దిగ్వాల్, మద్రి గ్రామ పరిధిలో జోరుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా చింతలఘట్టు గ్రామ పరిధిలోని చాలావరకు గుట్టలు ఇప్పటికే కరిగిపోయాయి. గతంలో ఈ గుట్టల తవ్వకాల్లో ఓ వ్యక్తిపై పెద్ద బండరాయి మీద పడి చనిపోయినా అక్రమార్కులు నిర్భయంగా తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు సైతం మిన్నకుండిపోవడంతో పగలు, రాత్రి అనే తేడాలేకుండా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల సాక్షాత్తు కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశించినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొత్తూరు(డి) గ్రామానికి చెందిన రెండు టిప్పర్లను సీజ్ చేసి నామమాత్రం ఫైన్ విధించి వదిలేయడం పలు విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


తరలుతున్న మట్టి

గుట్టలను కాపాడాలి..



పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని అక్రమంగా తరిస్తున్నవారిపై చర్యలు తీసుకుని గుట్టలను కాపాడాలి. అసైన్డ్, పట్టా భూములనే తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో పంట పొలాలు పాడవుతున్నాయి.

-తహేసిమ్, దిగ్వాల్ వాసి

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు ఎవరికి కూడా మేము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఎక్కడపడితే అక్కడ నుంచి మట్టిని తరలిస్తే ఎక్స్‌వేటర్లు, టిప్పర్లను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

-బాలశంకర్, తహసీల్దార్

సాగులో సాంకేతికత

- డ్రోన్‌తో పంటలకు ఎరువుల స్ప్రే..
- సమయం, ఖర్చు ఆదా

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 23 : పంటల సాగులో రోజురోజుకూ ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుంటున్నారు. పంటల్లో చీడపీడల నివారణ, మొక్కల పెరుగదుల తదితరవాటికి ఉపయోగించే ఎరువులు, క్రిమి సంహారక మందులను డ్రోన్ సాయంతో స్ప్రే చేస్తూ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. శ్రీ బుగ్గ రాజారాజేశ్వర రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం (ఎఫ్‌పీవో) నారాయణరావుపేట పరిధిలోని గ్రామాల రైతుల సౌకర్యార్థం డ్రోన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో సుమారు 700 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వారంతా పంటలకు నానో యూరియా, నానో డీఏపీ, పోటాష్‌తో పాటు క్రిమిసంహారక మందులు ఈ డ్రోన్ తోనే స్ప్రే చేస్తున్నారు.

శ్రమ లేకుండా..

మండలంలోని అయా గ్రామాల్లో వరితో పాటు పత్తి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరం పంట పొలంలో ఎలాంటి శ్రమ లేకుండా కేవలం పది నిమిషాల్లో నానో లిక్విడ్, క్రిమిసంహారక మందులను డ్రోన్ స్ప్రే చేస్తుంది. దీనికి గాను కేవలం రూ.450 మాత్రమే ఖర్చు అవుతుంది. అదే రైతులే ఎరువులు, మందులు చల్లాలంటే శ్రమతోపాటు చాలా సమయం పడుతుంది. కూలీలను పెట్టించి చల్లినా ఆర్థిక భారం తప్పదు. అంతేకాకుండా డ్రోన్ వాడకంతో పంటల దిగుబడి సైతం అధికంగా వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు డ్రోన్‌తో అయితే ఎకరాకు రూ.550 వరకు వసూలు చేస్తుండగా.. ఎఫ్‌పీవోలోని రైతులకు మాత్రం రూ.450 తీసుకుంటున్నారు.


డ్రోన్ సహకరంతో మందులు స్ప్రే చేస్తున్న రైతులు

సులభంగా మందుల స్ప్రే...

ఎఫ్‌పీవోలో రైతులకు డ్రోన్ అందుబాటులో ఉంచడం సంతోషంగా ఉంది. తక్కువ ఖర్చు.. తక్కువ సమయంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు సులభంగా స్ప్రే చేసుకోవచ్చు. భవిష్యత్తులో మరిన్ని సాంకేతిక పనిముట్లను అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం సహకారం అందించాలి.

-గుర్రం లింగారెడ్డి, రైతు, నారాయణరావుపేట

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు క్రీడాకారుల ఎంపిక


ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేసన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎం.ఎస్.అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు సోమవారం ఎంపికలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 105 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఉమ్మడి జిల్లా జట్టుకు 16 మందిని ఎంపిక చేశా. వారిలో రాహుల్ నాయక్, హిశాంత్, రుత్విక్‌రోళ్ల, దీక్షిత్, యోగేశ్వర్‌సింగ్, విక్రమ్ రాథోడ్, అంజి, సిరిల్‌డాల్సన్, మనిషత్విక్, గణేష్, పాండు, నెవిన్‌మానిత్, ప్రణీత్‌రెడ్డి, స్టాలిన్, అక్షయ్‌కుమార్, హరీష్‌గౌడ్ ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రారంభయ్యే అండర్-19 ఇంటర్‌డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.


విద్యార్థులకు భూసార పరీక్ష నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీఏవో రాధిక, శాస్త్రవేత్తలు

భూసార పరీక్షతో అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక


చిన్నకోడూరు, సెప్టెంబరు 23 : పంట దిగుబడిలో భూసార పరీక్ష ముఖ్యపాత్ర పోషిస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అన్నారు. సోమవారం మండలంలోని గోనెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్ష నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూసార పరీక్షతో భూమిలోని పోషకాలు తెలుసుకుని అందుకనుగుణంగా పంటలు, ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజయ, ఏడీఏ పద్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ రమాదేవి , డాక్టర్ ఉమారాణి , డాక్టర్ శ్వేత, డాక్టర్ సరిత, డాక్టర్ పల్లవి, ఏవో జయంత్ కుమార్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో పంటల సాగుపై శిక్షణ ఇవ్వాలి

కుకునూరుపల్లి, సెప్టెంబరు 23: తక్కువ నీటితో పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక అధికారులకు సూచించారు. సోమవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో నీరు, నేల యాజమాన్య శిక్షణ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి సంరక్షణ పద్ధతులపై వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నెట్ ఆఫ్ ఇరిగేషన్ లిమిటెడ్ డీజీఎంఏ సుబ్బారావు మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యంపై అవగాహన కల్పించారు. శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధుజ పూలు, కూరగాయల సాగుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వాలాంతరి, సహాయ వ్యవసాయ అధికారి సునిత, అన్నపూర్ణ, కుకునూరుపల్లి వ్యవసాయ అధికారి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు

మెదక్‌లో కారు బీభత్సం.. బైకులు ధ్వంసం

- మహిళకు తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23: మెదక్ పట్టణంలో ఆదివారం రాత్రి కారు అదుపు తప్పి అతివేగంగా ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఫుట్‌పాత్‌పైకి దూసుకువచ్చి బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఆసుపత్రిలో పని చేస్తున్న పోచమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అంతేకకుండా కారు హాస్పిటల్ ఎదుట పార్కింగ్ చేసిన మూడు బైకులను ఢీకొట్టగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నాగరాజు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రమాదానికి నిద్రమత్తే కారణమని భావిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి

- తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలశాఖ ఆధ్వర్యంలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 317 బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23 : గతంలో గ్రామాల్లోని పలు అభివృద్ధి చేపట్టిన బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్ జ్యోతి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులను విడుదల చేయకపోవడం బాధాకరం అన్నారు.

బొల్లారంలో గంజాయి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

జిన్నారం, సెప్టెంబరు 23: బొల్లారం మున్సిపాలిటీలో గంజాయి పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం సోమవారం రాత్రి 9 గంటలకు మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. కాగా, ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరు మహిళల నుంచి 9.8 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

అర్హులైన ప్రతీ విద్యార్థికి గురుకులంలో సీటు

- ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజేపీ ఆర్‌సీవో సంతోషి


తునికిలోని గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న అధికారి

కౌడిపల్లి, సెప్టెంబరు 23: ఉమ్మడి మెదక్ జిల్లాలోని 5 నుంచి 8 తరగతులకు చెందిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల (ఎంజేపీ)లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి సోమవారం విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌడిపల్లి మండలంలోని తునికి గురుకుల పాఠశాలలో జరిగి ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో సంతోషి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ మెరిట్ ప్రకారం భర్తీ చేయగా మిగిలి సీట్లను కేటగిరిల వారీగా భర్తీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలలో సీట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కన్వీనర్ శివప్రసాద్, మెదక్ జిల్లా కన్వీనర్ హరిబాబు వివిధ గురుకుల పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్‌లు ఉన్నారు.

ఎస్టీయూ జిల్లా కన్వీనర్‌గా వినయ్ కుమార్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23: చిన్నశంకరంపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ ఎస్టీయూ జిల్లా నమస్తే ఉపాధ్యాయ మాస పత్రిక జిల్లా కన్వీనర్‌గా నియమాకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంరతం పోరాడుతమన్నారు. అనంతరం ఆయను సన్మానించారు.


వినయ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భర్త వేధింపులు.. భార్య బలవన్మరణం


జనాబాయి(ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 23; భర్త వేధింపులు తాళలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ వెంకటొరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిర్గాపూర్ మండలంలోని కిషన్‌తండాకు చెందిన నాందేవ్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి అనుమానిస్తూ భార్య జనాబాయి(35)ను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో మూడు మాసాల కింద జనాబాయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. పెద్దల పంచాయితీ నిర్వహించి కలిసి ఉండాలని చెపారు. అయినా నాందేవ్‌లో మార్పు రాక పోగా తిరిగి భార్యను వేధిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చేసిన జనాబాయి ఆదివారం సాయంత్రం పొలం వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి రాథోడ్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాందేవ్‌పై కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటొరెడ్డి తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త..


గణేష్ (ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 23: భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ మండలం నర్సంపల్లిలో చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం గ్రామానికి చెందిన నల్ల గణేష్ (50) వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. సంసారం విషయంలో ఈ నెల 19న భార్య బాలమణితో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

మాసాయిపేట, సెప్టెంబరు 23 : మండల కేంద్రమైన మాసాయిపేటలో ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గౌటి వెంకటేశం (35) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఒంటరితనం భరించలేక ఆదివారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

26, 29 తేదీల్లో ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 : సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న అండర్-19 బాలబాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు ఎంపికలు ఉంటాయని తెలిపారు. కొండాపూర్ మండలం పెద్దాపూర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న హత్నూరలోని డా.బీఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాలలో చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు పదో తరగతి మెమో, కాలేజ్ బోనాఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 8106841226, 9440686408 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే పేరున పేదల భూములు

- అధికారుల తప్పిదంతో రికార్డుల్లో మారిన పేర్లు
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు బాధితుల మొర

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : రెవెన్యూ అధికారుల అత్యుత్సాహంతో నిరుపేదలు అన్యాయం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే జిన్నారం మండలం అందూర్ గ్రామంలో సర్వే నంబర్ 378లో ఖమరున్నీసా, రఫక్ సుల్తానా, అక్తరున్నీసాలకు చెందిన 1.02 ఎకరాల భూమి ఉన్నది. కానీ రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల్లో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పేరును నమోదు చేయడంతో వీరికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు రైతుభరోసా, రైతు రుణమాఫీని పొందలేకపోయారు. పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డికి ఈ గ్రామంలో కొంత భూమి ఉండగా గతంలో విక్రయించారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం అసలైన పట్టాదారుల పేర్లను తొలగించి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పేరును నమోదు చేశారు. అంతేకాకుండా పేరు ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి ఉన్నా.. ఆధార్‌కార్డు మరొకరిది జత చేశారు. రెవెన్యూ అధికారుల తప్పిదంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ ఎండీ ఖాదర్‌ను కోరారు. దీంతో మాజీ సర్పంచ్ రెవెన్యూ అధికారులను అడిగినా స్పందించకపోవడంతో నేరుగా ఇదే విషయాన్ని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డిని వద్దకు వెళ్లి అడగగా ఈ విషయంలో తన ప్రమేయమేమి లేదన్నారు. ఇదే విషయమై తిరిగి రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి అడగగా పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి కాగితంపై రాసి ఇస్తే చేస్తామని స్పష్టం చేశారు. దీంతో చేసేదేమీ లేక తమ సమస్యను కలెకర్‌కు వివరించినట్లు బాధితులు తెలిపారు.

రుణ వాయిదాలు చెల్లించలేదని దాడి

- పోలీసులు, అధికారులకు ఫిర్యాదు

తూప్రాన్, సెప్టెంబరు 23: మహిళా గ్రూపులో రుణం తీసుకుని వాయిదాలు చెల్లించడంలేదని కారణంతో ఒకరిపై దాడికి పాల్పడిన సంఘటన తూప్రాన్ మండలం వట్టూరులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పాంబండ ప్రియాంక మహిళా గ్రూపులో రుణం తీసుకుంది. ఇంటి పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో మూడు నెలలుగా రుణ వాయిదాలు చెల్లించడంలేదు. దీంతో ఆదివారం రాత్రి రుణం చెల్లింపుల కోసం వీవోఏ (సీఏ) వెంగలి సంతోష్ ఇంటికి వచ్చి బూతులు తిడుతూ చీపురుతో దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయమై తూప్రాన్ పోలీసులు, తూప్రాన్ ఆర్డీవో, ఎంపీడీవోలుకు కూడా ఫిర్యాదు చేసింది.



కొత్లాపూర్‌లో నీట మునిగిన పల్లె ప్రకృతివనం

నీట మునిగినా పట్టించుకోరా.?

- నీటితో నిండుకున్న కొత్లాపూర్ పల్లె ప్రకృతివనం, డంపు యార్డు
- నిర్లక్ష్యం వహిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని వాతావరణం నెలకొల్పేందుకు గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనం, డంపు యార్డులను నిర్మించింది. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో లేకపోవడంతో పోషమ్మకుంటలో పల్లె ప్రకృతివనం, డంపు యార్డుని నిర్మించారు. పల్లె ప్రకృతివనంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించి గ్రామానికి పచ్చని వాతావరణం నెలకొల్పారు. అదే విధంగా డంపుయార్డుని నిర్మించి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువుని తయారు చేసేవారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు పోషమ్మకుంటలో భారీగా నీరు చేరి పల్లె ప్రకృతి వనం, డంపుయార్డులు నీట మునిగిపోయాయి. దీంతో సేకరించిన చెత్తను వేరుచేయకుండా అంతా కలిపి ఒకేదగ్గర గ్రామంలో ఉండే బావిలో వేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి వెంకట్‌ను ప్రశ్నించగా తాము పోషమ్మకుంటలో నీటిని తొలగించి డంపుయార్డుని వినియోగంలోకి తీసుకురావాలని ఇరిగేషన్ అధికారులకు రాతపూర్వకంగా విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోషమ్మకుంటలో నీటిని తొలగించాలని తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నీటిలో మునిగిపోయిన డంపుయార్డు

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



బస్సుల్లో ప్రయాణించిన వారికి బహుమతులను ప్రదానం చేస్తున్న పట్టణ సీఐ శివలింగం

జహీరాబాద్, సెప్టెంబరు 23: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం పేర్కొన్నారు. బస్సుల్లో ప్రయాణించిన పలువురు ప్రయాణికులకు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సీఐ మాట్లాడుతూ ప్రమాదాలనివారణలో భాగంగా ప్రయాణికులను ప్రోత్సహించే దిశగా ఆర్టీసీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సెప్టెంబరు నెలలో బస్సుల్లో ప్రయాణించిన పలువురు ప్రయాణికులను లక్కీడీప్ ద్వారా ఎంపిక చేసి గిఫ్ట్‌స్కీం పథకం కింద బహుమతులివ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ మహిళా ప్రయాణికులను డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే విధంగా ప్రోత్సహించే ఉద్దేశంతో ఉన్నతాధికారులు గిఫ్ట్‌స్కీం పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ప్రతీ 15 రోజులకోమారు లక్కీడీప్ ద్వారా ఎంపిక చేసి గిఫ్ట్ స్కీం పథకం కింద ముగ్గురు మహిళలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సోమవారం లక్కీడీప్‌లో ఎంపికైన ఒక్కో మహిళలకు రూ.వెయ్యి విలువచేసే బహుమతులను అందజేశారు. బహుమతులను అందుకున్న వారిలో మహేశ్వరీ, సుమ, పూర్ణిమ ఉన్నారు.

రేపు ఐటీఐలో అప్రెంటీస్ మేళా

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23: సంగారెడ్డిలోని ఐటీఐ కళాశాలలో ఈ నెల 25న అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ట్రేడ్‌లలో పాసైన వారు ఈ అప్రెంటీస్‌షిప్ మేళాకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

● భూసమస్యలపైనే అధిక ఫిర్యాదులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 23: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అల్లాదుర్గం అల్లాదుర్గం తహసీల్దార్ మల్లయ్య కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఇక పై జిల్లా కార్యాలయాలకు వెళ్లకుండా తహసీల్దార్ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా ప్రజావాణి కార్యక్రమంలో వ్యవసాయ భూములకు సంబంధించి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 6 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

● రేగోడు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మంచి స్పందన లభించింది. రేగోడులో 108 వాహనం లేక ఇబ్బందిగా ఉందని 108 వాహనం ఏర్పాటు చేయాలని కొండాపూర్ మాజీ సర్పంచ్ పండరి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నారాయణఖేడ్ నుంచి రేగోడు మీదుగా పటాన్‌చెరు వరకు బస్సును పునరుద్ధరించాలని రేగోడు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రేగోడు గ్రామానికి చెందిన 30మంది రైతుల పేర్లు ధరణిలో కాస్తు కాలం తొలగించడంతో ఇనాం భూములుగా చూపిస్తున్నారని, ఇనాం భూమికి పట్టా సర్టిఫికెట్ ఇచ్చి పాస్ బుక్కులు మంజూరు చేయాలని దరఖాస్తులో పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 13, ఆర్టీసీ, ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ నరేష్ తెలిపారు.



రేగోడు తహసీల్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

● చిన్నశంకరంపేట: భూసమస్యల పరిష్కారానికి రైతులు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల నుంచి 8 వినతులు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● నర్సాపూర్: నర్సాపూర్ తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో 4 భూ సమస్యల సంబంధించినవి కాగా ఒకటి రేషన్‌కార్డు సంబంధించిన ఫిర్యాదు వచ్చినట్లు వివరించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

పుల్‌కల్, సెప్టెంబరు 23: ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవ శోభాయాత్ర ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గొంగ్లూరుతో పాటుగా చౌటకూర్ గ్రామంలో త్రినేత్ర యువజన సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర కనుల పండువలా సాగింది. గొంగ్లూరులో మహిళలు, బాలికల కోలాటం అందరినీ ఆకట్టుకున్నది. చౌటకూర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా కార్యక్రమం ప్రజలు, యువకులను కట్టిపడేసింది. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే ముఖ్యఅతిథులుగా హాజరై వినాయకుడికి పూజలు చేశారు. త్రినేత్ర యువజన సంఘం అధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



నిమజ్జనోత్సవంలో ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి తదితరులు

యోగా శిక్షకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

● ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి

మాసాయిపేట, సెప్టెంబరు 23: ఆయుష్ ఆరోగ్య శాఖలో యోగ శిక్షకుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మాసాయిపేట ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. యోగా శిక్షకులుగా 842 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఇందులో421 మంది పురుష అభ్యర్థులు మరో 421 మంది మహిళా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. యోగాలో నైపుణ్యం, అర్హత పత్రాలు ఉన్నవారు ఆయుష్ శాఖ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపికైనవారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాలు ఉంటాయన్నారు.

క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



మైత్రీ మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 23: క్రీడలకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పటాన్‌చెరు మైత్రీ మినీస్టేడియంలో జిల్లాస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని పట్టు సాధించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌కుమార్, ఎంఈవో పీపీ రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మైత్రీ క్లబ్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేస్తా..

జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భద్రత కల్పించాల్సిన స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని 26మండలాల నుంచి వెయ్యి మంది బాలబాలికలు, వందల సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరవుతున్న క్రీడాపోటీల సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చూసుకునేందుకు కనీసం ఒక్క కానిస్టేబుల్‌ను సైతం నియమించలేదని మండిపడ్డారు. ముందస్తు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పటాన్‌చెరు డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌లపై డీజీపీకి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు.

గురుకులాల్లో అశాస్త్రీయ పనివేళలు సవరించండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : గురుకుల విద్యాసంస్థల్లో అశాస్త్రీయ పనివేళలు సవరించాలని, విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌వో పద్మజారాణికి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో ఉన్న పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ పలు డిమాండ్లు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్‌రావు, మోసిన్, బసవరాజు, మల్లేశం, జనార్దన్, లింగం, సతీష్, బసవరాజ్, ఫిరోజ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీపీఐ నేత మృతి



పన్యాల వజీర్‌బేగ్(ఫైల్)

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23: సీపీఐ పార్టీకి సదీర్ఘకాలంగా సేవలందించిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పన్యాల వజీర్ బేగ్ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఈ నెల 22న తుది శ్వాస విడిచారు. వజీర్‌బేగ్ మృతి విషయాన్ని తెలుసుకున్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, సీపీఐ పార్టీ నాయకులు సంతాపం తెలిపి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎ. రహ్మాన్, మహబూబ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్‌ల అందజేత

మునిపల్లి, సెప్టెండరు 23: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కు సంబంధించి గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం మండల కేంద్రమైన ఎంపీడీవో కారార్యలయంలో లబ్ధిదారులకు ఎంపీడీవో హరినందన్‌రావు అందజేశారు. మండల వ్యాప్తంగా మొదటి విడతలో 4,600 మందికి ప్రొసీడింగ్ పత్రాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్,మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు వీరన్నపాటీల్,పాండు,సుధకర్‌రెడ్డి,శివచంద్రకుమార్,నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 23: నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్‌కు చెందిన ప్రేమ్‌దాస్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.27 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్‌లో బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పండరి, ఖేడ్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్‌చారి, నాగల్‌గిద్ద గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ధన్‌రాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5 లక్షల ఎల్‌వోసీ అందజేత

నర్సాపూర్, సెప్టెంబరు 23: మండలంలోని గూడెంగడ్డ గ్రామానికి చెందిన శంకర్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌వోసీని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్‌తో కలిసి అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

● పలు మండలాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



సంగారెడ్డిలోని తారా కళాశాలలో శ్రమదానం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో స్వచ్చత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.జగదీశ్వర్, అధికారులు డా.సదయకుమార్, డా.జోష్న, డా.వాణి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డా.విజయ, వలంటీర్లు, కేడెట్లు పాల్గొన్నారు.

●జహీరాబాద్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని లైసిం ఉన్నతపాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. పారిశుధ్య పరిరక్షణలో మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛతపై పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చినవారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జహీరాబాద్: విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

● నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం పలు స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. డంపుయార్డు ప్రహరీ చుట్టూ కమిషనర్ జగ్జీవన్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్మికులతో కలిసి ప్రాసిసెంగ్ ప్లాంట్‌ను శుభ్రం చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చెత్త తొలగించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌మాజీద్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్‌అలీ, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలి

జహీరాబాద్, సెప్టెంబరు 23: మహిళలు మంచి పోషకాలున్న ఆహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, హేమలత పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో పోషకాహారంపై అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లడతూ సమతౌల్య ఆహారం ప్రాధాన్యత గురించి వివరించారు. మహిళల్లో రక్తహీనత నివారణకు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పలువురు మహిళలు వివిధ రకాలవంటకాలను తయారుచేసి తీసుకువచ్చారు. వంటకాల రుచులను చూసి పలువురు మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

● హత్నూర: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పతిష్టాత్మకంగా చర్యలు చేపట్టినట్లు సీడీపీవో ప్రియాంక పేర్కొన్నారు. సోమవారం హత్నూర రైతు వేదికలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా సద్వినియోగం చేసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, గ్రామ కార్యదర్శి మహేష్, మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పేదరిక నిర్మూలనే సెర్ప్ ధ్యేయం



నిజాంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళాసంఘాల సభ్యులు

నిజాంపేట, సెప్టెంబరు 23: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఏటా అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలతో మహిళలు పలు రంగాల్లో రాణిస్తున్నారని డీపీఎం జాన్‌కెనడీ పేర్కొన్నారు. మహిళాసంఘాల 7వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు తమ అభిప్రాయాలను సమావేశంలో వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ టార్గెట్ ప్రకారం రూ. 24 కోట్ల 74 లక్షలు ఉందని, దానికి 130 శాతం టార్గెట్ చేయాలనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. మండల వ్యాప్తంగా 6,356 మంది మహిళలు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి మూడేళ్ల వరకు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం జి. నాగరాజు, ఏపీఎం రాములు, సీసీలు స్వరూప లక్ష్మి, మండల పాలకవర్గం సుమలత, జ్యోతి, స్వప్న, రేణుక, రేవతి, అంగన్‌వాడీలు తదితరులు ఉన్నారు.

శివ్వంపేటలో...

శివ్వంపేట, సెప్టెంబరు 23: శివ్వంపేట మండల మహిళా సమాఖ్య 16 వ వార్షికోత్సవ మహాసభను సోమవారం సమాఖ్య అధ్యక్షురాలు నవనీత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలు అదనంగా ఆదాయం పెంచుకోవడం ద్వారా వారి జీవనోపాదులు పెంపొందించుకోవాలని అవగాహన కల్పించారు. పోషణ మాసోత్సవం సందర్భంగా మహిళలతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. మండల సమాఖ్య ఆర్థిక లావాదేవీలు, రాబోయే సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో మెడికల్ ఆఫీసర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఏపీఎం, సీసీలు, అన్ని గ్రామాల గ్రామ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, వీవోఏలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ప్రమాదకరంగా తగులుతున్న విద్యుత్ తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, సెప్టెంబరు 23: 'చెట్టుకు విద్యుత్ తీగలు అల్లుకొని ప్రమాదం పొంచి ఉంది' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ సిబ్బంది స్పందించారు. అధికారుల ఆదేశాలతో లైన్‌మెన్ సాయి సోమవారం ప్రమాదకరంగా చెట్టుకు అల్లుకొని అతుక్కున్న విద్యుత్‌వైర్లను కొమ్మలను తొలగించి విద్యుత్ వైర్లను సరిచేసి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

రేగోడు సెప్టెంబరు 23: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రేగోడు ఉపాధి హామీ పథకం టీఏలు శ్రీనివాస్, విజయ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ మల్లారెడ్డి, ఆమోజ్‌లు సోమవారం పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో 2006 నుంచి పనిచేస్తున్నామని, గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినా చేయలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఉపాధి హామీ కాంటాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఉపాధి హామీ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ వేయొద్దు

నారాయణఖేడ్, సెప్టెంబరు 23: ఉపాధ్యాయులకు ఇతరశాఖల్లో డిప్యుటేషన్ వేయవద్దని మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ కోరారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో పలువురు ఉపాధ్యాయులను పంచాయతీల ప్రత్యేక అధికారులుగా డిప్యుటేషన్‌పై నియమించడంతో ఆయా చోట్ల విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. తాము మండలపరిషత్, జిల్లా పరిషత్ సమావేశాల్లో ప్రస్తావించినందుకు స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, అధికారులు స్పందించి డిప్యుటేషన్‌లను రద్దు చేసి పాఠశాలలకు పంపినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు సైతం ఉపాధ్యాయులను ఇతర శాఖల్లో డిప్యూటేషన్లపై నియమించవద్దని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకం సందర్భంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్న ఈ ప్రాంతంలో ఖాళీలన్నీ భర్తీ చేశాకే ఇతర ప్రాంతాల్లో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మా కాలనీలో సీసీ రోడ్డు వేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

జిన్నారం, సెప్టెంబరు 23: బొల్లారం మున్సిపాలిటీలోని పోచమ్మ బస్తీలో సీసీ రోడ్డు ఏర్పాటు విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారును కలిసిన కాలనీవాసులు సీసీ రోడ్డు వేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీలో అన్నిచోట్ల నూతన సీసీ రోడ్లు వేస్తున్నా, తమ కాలనీలో మాత్రం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు వేసి కాలనీవాసుల సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గోకర్ణ శివాలయంలో శశిధర్‌రెడ్డి పూజలు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23: కర్ణాటక రాష్ట్రంలోని ఉత్తర కన్నడ జిల్లా గోకర్ణ శివాలయంలో సోమవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఆర్చ్ ఫార్మా పరిశ్రమలో బీఎంఎస్ ఘన విజయం



పరిశ్రమ వద్ద సంబరాలు జరుపుకుంటున్న బీఎంఎస్ నాయకులు

హత్నూర, సెప్టెంబరు 23: మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామ శివారులోని ఆర్చ్ ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ ఘన విజయం సాధించారు. పరిశ్రమలో 59మంది కార్మికులు ఓటర్లుగా ఉండగా.. బీఎంఎస్ అధ్యక్షుడిగా పోటీ చేసిన వడిగపల్లి ప్రభుకు 40 ఓట్లు రావడంతో విజయం సాధించారు. సీఐటీయూ తరపున పోటీ చేసిన వడిగపల్లి శ్రీరాములుకు 18ఓట్లు వచ్చాయి. దీంతో బీఎంఎస్ ఘన విజయం సాధించడంతో కార్మికులు పరిశ్రమ ఎదుట సంబరాలు జరుపుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని విజయం సాధించిన బీఎంఎస్ అధ్యక్షుడు వడిగపల్లి ప్రభు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ఫస్ట్



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా నాయకులు

వట్‌పల్లి, సెప్టెంబరు 23: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడు ముందుండేది పీఆర్టీయూనేనని, అత్యధిక సభ్యులున్న సంఘం కూడా పీఆర్టీయూ అని ఆ యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాణయ్య పేర్కొన్నారు. సోమవారం వట్‌పల్లిలో పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాణయ్య మాట్లాడుతూ.. త్వరలో రెండు డీఏలు విడుదల కానున్నాయన్నారు. కాగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా దిగంబర్‌రావు, ప్రధానకార్యదర్శిగా నర్సింలును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీశైలం, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునిత, కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మదన్‌గోపాల్, ఎన్నికల పరిశీలకులు సరోత్తం, రాజమల్లు, సిద్దేశ్వర్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: బీఆర్‌ఎస్



జహీరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్, సెప్టెంబరు 23: కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్ మండలాలకు చెందిన మండలపార్టీల అధ్యక్షులు తట్టునారాయణ, వెంకటేశం, నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ మశ్చందర్‌లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విషయాన్ని పక్కనబెట్టి హైడ్రా కార్యక్రమాలకు తెరలేపిందన్నారు. హైడ్రా ప్రభావంతో ఎంతోమంది నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలోనే మంజూరైన పనులను తామే మంజూరీచేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్‌హయాంలో పార్టీలకు, అన్నివర్గాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమపథకాలను అమలు చేసి ఆదుకున్నామని వారు గుర్తుచేశారు. అయితే 2022లో ఆర్ అండ్‌బి పరిధిలో 12రోడ్లను మంజూరు చేసి రూ.28 కోట్లను కేటాయించగా, అదే సంవత్సరంలో పంచాయతీరాజ్ పరిధిలో 26పనులకు రూ.52కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. అయితే ఆ పనులు వివిధ కారణాలతో పెండింగ్‌లో పడ్డాయని, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తామే పనులను చేయిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం హస్యాస్పదంగ ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు ప్రభుపాటిల్, రాజశేఖర్, ప్రతాప్‌రెడ్డి, రాములు, నర్సింహాగౌడ్, ఏజాజ్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్, వెల్దుర్తి మండలాల్లో ఉపాధి పనులపై ప్రజాదర్బార్

కల్హేర్, సెప్టెంబరు 23: సిర్గాపూర్ మండలంలో ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను ఎంపీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వెల్లడించారు. కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా అదనపు డీఆర్డీవో బాల్‌రాజ్, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావ్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి సుభాష్ హాజరు సామాజిక తనిఖీ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు సిర్గాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై ఈ నెల 11 నుంచి 22 వరకు తనిఖీలు నిర్వహించారు. రూ 3.92 కోట్లు కూలీలకు వేతనాల రూపంలో చెల్లించగా, రూ. 7.41 లక్షలు మెటీరియల్ రూపంలో ఖర్చు చేసినట్లు వివరించారు. ఇందులో అత్యధికంగా కడ్పల్ గ్రామ పంచాయతీలో రూ 98,933 దుర్వినియోగం అయినట్లు తనిఖీలో తేల్చారు. సిర్గాపూర్ సర్పంచ్ తండాలో రూ.10,317, ఖాజాపూర్‌లో రూ.8,781లు దుర్వినియోగం కాగా మిగతా పంచాయతీల్లో కొద్దిపాటి తేడాలు మాత్రమే వచ్చాయి. కాగా కడ్పల్ పంచాయతీ ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు రెండు రోజుల్లో డబ్బులు కట్టాలని, లేదంటే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంపీడీవో మల్హార్ నాయక్, ఈజీఎస్ ఏపీడీ రాజు, ఏపీవో బస్వరాజ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ నర్సయ్య ఈసీ ఇక్బాల్, టీఏలు వెంకట్‌రెడ్డి, క్రిష్ణ, రమేష్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సోమవారం వెల్దుర్తి ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఎంపీడీవో ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏపీడీ రంగాచారి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. వెల్దుర్తి ఉమ్మడి మండలంలోని గ్రామాల్లో మార్చి 2024 ఏడాది కాలంలో చేపట్టిన పనుల నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ... ఒకరికి బదులుగా మరొకరు పనిచేసిన వారికి బిల్లులు చెల్లించినందుకు, అదనపు పేమెంట్ చేసినందుకు వెల్దుర్తి ఉమ్మడి మండలంలో రూ. లక్ష 70వేలు రికవరీకి ఆదేశించినట్లు తనిఖీ బృందం తెలిపింది. విధులు సక్రమంగా నిర్వహించనందుకు సిబ్బందికి రూ. 60వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ రంగాచారి, విజిలెన్స్ అధికారి శ్రీహరి, ఎంపీవో విఘ్నేశ్వర్, ఏపీవో రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.